బెస్ట్ వుమన్ ఫుట్‌బాలర్ సౌమ్య

ఏఐఎఫ్ఎఫ్ ప్రతిష్ఠాత్మక పురస్కారం సొంతం

అవార్డు సాధించిన తొలి తెలంగాణ ప్లేయర్‌గా రికార్డు

భువనేశ్వర్: తెలంగాణ యువ ఫుట్‌బాలర్ గుగులోతు సౌమ్య ప్రతిభకు తగిన గుర్తింపు లభించింది. ఇందూరులో పుట్టి అంచలంచెలుగా ఎదిగిన సౌమ్య..అనతి కాలంలోనే దేశం గర్వించదగ్గ ప్లేయర్‌గా గుర్తింపు తెచ్చుకుంది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య(ఏఐఎఫ్ఎఫ్) వార్షిక అవార్డుల్లో భాగంగా 'బెస్ట్ వుమన్ ఫుట్‌బాలర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు విజేతగా నిలిచింది. శుక్రవారం భువనేశ్వర్‌లో అట్టహాసంగా జరిగిన కార్యక్రమంలో సౌమ్య..ఏఐఎఫ్ఎఫ్ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందుకుంది. తెలంగాణ నుంచి బెస్ట్ వుమన్ ఫుట్‌బాలర్ అవార్డు దక్కించుకున్న తొలి ప్లేయర్‌గా అరుదైన రికార్డు సొంతం చేసుకుంది. 2021లో జాతీయ జట్టు తరపున అరంగేట్రం చేసిన ఈ 23 ఏండ్ల నిజామాబాద్ అమ్మాయి ఇప్పటి వరకు 33 మ్యాచ్‌లాడి 5 గోల్స్ చేసింది. నేషనల్ టీమ్‌కే గాకుండా దేశంలో ప్రముఖ క్లబ్‌లుగా వెలుగొందుతున్న ఈస్ట్‌బెంగాల్, గోకులం కేరళ లాంటి జట్లకు సౌమ్య ప్రాతినిధ్యం వహించి సత్తాచాటుతున్నది. సాధారణ గిరిజన కుటుంబం నుంచి వచ్చిన సౌమ్య..ప్రస్తుతం భారత జట్టుకు మిడ్‌ఫీల్డర్‌గా కీలక సేవలు అందిస్తున్నది. ఏఐఎఫ్ఎఫ్ అత్యున్నత పురస్కారం సాధించిన సౌమ్యను సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రంలో ఫుట్‌బాల్ అభివృద్ధికి మరిన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మరోవైపు మోహన్‌బగాన్ సూపర్‌జెయింట్స్ డిఫెండర్ సుభాశిష్ బోస్ 'బెస్ట్ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ద ఇయర్' అవార్డు కైవసం చేసుకున్నాడు.

ఏషియన్ జిమ్నాస్టిక్స్ టోర్నీకి నిష్క

హైదరాబాద్, ఆట ప్రతినిధి: పుణె వేదికగా జరుగుతున్న జాతీయ జూనియర్, సీనియర్ అర్టిస్టిక్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ జిమ్నాస్ట్ నిష్క అగర్వాల్ సత్తాచాటింది. శుక్రవారం జరిగిన మహిళల అర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ విభాగంలో నిష్క 43.750 స్కోరుతో రెండో స్థానంలో నిలిచింది. ఇదే విభాగంలో సమంత(రైల్వేస్ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్, 43.900), స్నేహ తరియాల్(ఢిల్లీ, 43.750) వరుసగా ఒకటి, మూడు స్థానాలు దక్కించుకున్నారు. జాతీయ టోర్నీలో రాణించడం ద్వారా కొరియా వేదికగా జూన్ 12 నుంచి మొదలయ్యే ఏషియన్ చాంపియన్‌షిప్ టోర్నీకి నిష్క ఎంపికైంది.

క్రికెట్‌లో ట్రాన్స్‌జెండర్లపై నిషేధం

ఈసీబీ కీలక నిర్ణయం

లండన్: ట్రాన్స్‌జెండర్ క్రికెటర్లకు ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) షాకిచ్చింది. ఇక నుంచి వారు మహిళల, బాలికల క్రికెట్ ఆడకుండా వారిపై నిషేధం విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇటీవల అక్కడి సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాల నేపథ్యంలో ఈసీబీ చర్యలకు ఉపక్రమించింది. 'పుట్టుకతో ఆడవారిగా జన్మించినవాళ్లు మాత్రమే మహిళల, బాలికల క్రికెట్ ఆడటానికి అర్హులు. లింగమార్పిడి చేయించుకున్న వారు ఓపెన్, మిక్స్‌డ్ క్రికెట్‌లో పాల్గొనవచ్చు' అని ఈసీబీ తెలిపింది. రెండ్రోజుల క్రితమే ఇంగ్లండ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ కూడా ఇదే నిర్ణయాన్ని తీసుకుంది.

అభిషేక్ (74)

రైజర్స్ మళ్లీ

గుజరాత్ చేతిలో ఓటమి • అభిషేక్ ఒంటరి పోరాటం వృథా • రాణించిన గిల్, బట్లర్

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ప్లేఆఫ్స్ రేసు రసవత్తరంగా సాగుతున్నది. గెలిస్తే కానీ రేసులో నిలువలేని పరిస్థితుల్లో జట్లు కడదాకా కొట్లాడుతున్నాయి. లీగ్‌లో తీవ్ర ఒడిదొడుకులతో సతమతమవుతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ తమ అభిమానులను మళ్లీ నిరాశపరిచింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో రైజర్స్ 38 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్ చేతిలో ఓటమిపాలైంది. గుజరాత్ నిర్దేశించిన 225 పరుగుల లక్ష్యఛేదనలో హైదరాబాద్ 20 ఓవర్లలో 186/6 స్కోరుకు పరిమితమైంది. అభిషేక్‌శర్మ(41 బంతుల్లో 74, 4ఫోర్లు, 6సిక్స్‌లు) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నా లాభం లేకపోయింది. సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ రెండేసి వికెట్లు తీశారు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన టైటాన్స్.. శుభ్‌మన్ గిల్ (38 బంతుల్లో 76, 10 ఫోర్లు, 2 సిక్స్‌లు), జోస్ బట్లర్ (37 బంతుల్లో 64, 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), సాయి సుదర్శన్ (23 బంతుల్లో 48, 9 ఫోర్లు) దంచేయడంతో 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 224 పరుగుల భారీ స్కోరు సాధించింది.

సన్‌రైజర్స్ ధమాల్:

భారీ ఛేదనను సన్‌రైజర్స్ దూకుడుగానే ఆరంభించింది. ట్రావిషేక్ జోడీ భారీ మెరుపులు మెరిపించకపోయినా వేగంగానే పరుగులు రాబట్టి మంచి ఆరంభాన్నే అందించారు. సిరాజ్ తొలి ఓవర్లో రెండో బంతిని అభిషేక్.. లాంగాఫ్ మీదుగా సిక్స్‌తో ఛేదనను ప్రారంభించాడు. నాలుగు బౌండరీలతో హెడ్ జోరు మీదే కనిపించాడు. కానీ ప్రసిద్ధ్ బౌలింగ్‌లో రషీద్ ఖాన్ సూపర్ క్యాచ్‌తో అతడు వెనుదిరగాల్సి వచ్చింది. అభిషేక్, ఇషాన్ కిషన్ (13) క్రీజులో ఉన్నా 5-10 ఓవర్ల మధ్య హైదరాబాద్ చేసింది 40 పరుగులే. అభిషేక్ స్వేచ్ఛగా బ్యాట్ ఝుళిపించకపోగా ఇషాన్ వైఫల్యం కొనసాగింది. కొయెట్జ్ బౌలింగ్‌లో సిక్సర్‌తో అభిషేక్ హాఫ్ సెంచరీ పూర్తయింది. ఫిఫ్టీ తర్వాత అభిషేక్ గేర్ మార్చినా అప్పటికే ఛేదించాల్సిన రన్‌రేట్ 15కు పెరిగిపోయింది. క్లాసెన్ కూడా భారీ షాట్లు ఆడలేకపోయాడు. ఆరు ఓవర్లలో హైదరాబాద్ విజయానికి 98 పరుగులు అవసరమవగా.. వెంటవెంటనే వికెట్లు కోల్పోయి మూల్యం చెల్లించుకుంది. గుజరాత్ కట్టుదిట్టమైన బౌలింగ్‌తో క్లాసెన్(23), అనికేత్(3), మెండిస్(0) నిరాశపరిచారు. అభిషేక్ ఒంటరి పోరాటం జట్టును గెలిపించలేక రైజర్స్ ఏడో ఓటమిని ఖాతాలో వేసుకుంది.

టాపార్డర్ దూకుడు:

సీజన్ ఆరంభం నుంచీ నిలకడగా రాణిస్తున్న గుజరాత్ టాపార్డర్.. సన్‌రైజర్స్‌తోనూ దానిని కొనసాగించింది. టాప్-3 బ్యాటర్లు సాయి, గిల్, బట్లర్ ధాటిగా ఆడటంతో టైటాన్స్ మరోసారి భారీ స్కోరు సాధించింది. ఓపెనింగ్ ద్వయం సాయి, గిల్ తొలి వికెట్‌కు 6.5 ఓవర్లలోనే 87 పరుగులు జోడించి టైటాన్స్‌కు మెరుపు ఆరంభాన్ని అందించారు. సాయి అయితే బౌండరీల వర్షం కురిపించాడు. షమీ మూడో ఓవర్లో ఐదు ఫోర్లతో 20 పరుగులు రాబట్టాడు. కమిన్స్ వేసిన మరుసటి ఓవర్లో గిల్.. 4, 4, 6తో విజృంభించడంతో 4 ఓవర్లకే గుజరాత్ స్కోరు ఫిఫ్టీ మార్కును దాటింది. హర్షల్ ఓవర్లోనూ సుదర్శన్ నాలుగు ఫోర్లు కొట్టాడు. బౌలింగ్ మార్పుగా వచ్చిన అన్సారీ.. 7 ఓవర్లో ఐదో బంతికి సుదర్శన్‌ను ఔట్ చేయడంతో టైటాన్స్ తొలి వికెట్ కోల్పోయింది. అతడి స్థానంలో వచ్చిన బట్లర్ కూడా బ్యాట్‌కు పనిచెప్పడంతో గుజరాత్ స్కోరు ఓవర్‌కు 12 పరుగులకు తగ్గకుండా దూసుకెళ్లింది. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 37 బంతుల్లోనే 62 పరుగులు జోడించారు. షమీ పదో ఓవర్లో ఎక్స్‌ట్రా కవర్స్ దిశగా బౌండరీతో గిల్ వరుసగా మూడో అర్ధ శతకం సాధించాడు. ఈ సీజన్‌లో గిల్‌కు ఇది ఐదో ఫిఫ్టీ. గిల్ రనౌట్ అవడంతో బాదుడు బాధ్యతను బట్లర్ తీసుకున్నాడు. అన్సారీ బౌలింగ్‌లో 6, 4తో హాఫ్ సెంచరీ చేసిన బట్లర్.. హర్షల్ ఓవర్లో బౌండరీ, సిక్సర్‌తో టైటాన్స్ స్కోరు 200 పరుగుల మార్కును దాటింది.

సంక్షిప్త స్కోర్లు

గుజరాత్: 20 ఓవర్లలో 224/6 (గిల్ 76, బట్లర్ 64, ఉనద్కత్ 3/35, కమిన్స్ 1/40); **హైదరాబాద్:** 20 ఓవర్లలో 186/6 (అభిషేక్ 74, క్లాసెన్ 23, సిరాజ్ 2/33, ప్రసిద్ధ్ కృష్ణ 2/19)

ఎల్‌వీఆర్ స్మారక బాస్కెట్‌బాల్ టోర్నీ షురూ

హైదరాబాద్, ఆట ప్రతినిధి: చాదర్‌ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండ్ వేదికగా ఎల్ వెంకట్ రామ్‌రెడ్డి(ఎల్‌వీఆర్) స్మారక బాస్కెట్‌బాల్ టోర్నీ శుక్రవారం మొదలైంది. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి మల్లారెడ్డి, బీఎఫ్ఐ టెక్నికల్ కమిటీ చైర్మన్ నార్మన్ ఇసాక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ 'రాష్ట్ర క్రీడారంగానికి ఎల్‌వీఆర్ చేసిన సేవలు మరువలేనివి. సుదీర్ఘ కాలం క్రీడాభివృద్ధికి ఆయన పాటుపడ్డారు. ఎంతో మందికి క్రీడాకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దక్కడంలో కీలకంగా వ్యవహరించారు. ముఖ్యంగా జీహెచ్ఎంసీలో సమ్మర్ క్యాంప్‌ల నిర్వహణకు ఎల్‌వీఆర్ ఆద్యుడు' అని అన్నారు.

లంకకు తొలి విజయం

కొలంబో: స్వదేశంలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో శ్రీలంక మహిళల జట్టు బోణీ కొట్టింది. శుక్రవారం కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో లంక 5 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాను ఓడించింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 235 పరుగులు చేసింది. డెర్క్‌సెన్ (61), లారా (46) ఆ జట్టును ఆదుకున్నారు. లంక బౌలర్లలో మల్కి (4/50), విహంగ (3/41) రాణించారు. స్వల్ప ఛేదనను శ్రీలంక 46.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి పూర్తి చేసింది. హర్షిత సమరవిక్రమ (77), కవిష (61) నాలుగో వికెట్‌కు 128 పరుగులు జోడించి లంక విజయంలో కీలకపాత్ర పోషించారు. ఈ టోర్నీలో ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ సౌతాఫ్రికాకు ఇది రెండో పరాభవం.

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ముంబై	11	7	4	0	14	1.27
గుజరాత్	10	7	3	0	14	0.86
బెంగళూరు	10	7	3	0	14	0.52
పంజాబ్	10	6	3	1	13	0.19
ఢిల్లీ	10	6	4	0	12	0.36
లక్నో	10	5	5	0	10	-0.03
కోల్‌కతా	10	4	5	1	9	0.27
రాజస్థాన్X	11	3	8	0	6	-0.78
హైదరాబాద్	10	3	7	0	6	-1.19
చెన్నై X	10	2	8	0	4	-1.21

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

అంబానీ కుక్కకు 'ముంబై' సంతాపం

ముంబై: ప్రముఖ వ్యాపారవేత్త ముకేశ్ అంబానీ పెంపుడు కుక్క హ్యాపీ మృతికి ముంబై ఇండియన్స్ జట్టు సంతాపం ప్రకటించింది. గురువారం రాజస్థాన్ రాయల్స్‌పై భారీ విజయం సాధించిన నేపథ్యంలో ముంబై కెప్టెన్ హార్దిక్ పాండ్యా, కోచ్ మహేల జయవర్దనేను జట్టు యజమాని నీతా అంబానీ అభినందించారు. మ్యాచ్ ముగిసిన తర్వాత ఫోన్‌లో మాట్లాడిన నీత.. కుక్క హ్యాపీ మరణించిన విషయాన్ని జట్టు సభ్యులతో పంచుకుంది. ఈ సందర్భంగా హ్యాపీని మరింత గుర్తుంచుకునేలా మీరు విజయం సాధించారని పేర్కొంది. ఈ వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. గంట వ్యవధిలోనే 3 మిలియన్ల వ్యూస్ సాధించింది. కుక్క హ్యాపీ మృతిపై పలువురు సంతాపం తెలియజేస్తూ సందేశాలు రాసుకొచ్చారు.

బాబర్, రిజ్వాన్ ఖాతాలు బ్లాక్

ఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్థాన్‌కు చెందిన అథ్లెట్లు, ప్రముఖుల సోషల్ మీడియా ఖాతాలపై నిషేధం విధిస్తున్న భారత్.. తాజాగా ఆ జట్టు స్టార్ క్రికెటర్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్ ఇన్‌స్టా ఖాతాలనూ బ్లాక్ చేసింది. రెండ్రోజుల క్రితమే పాక్ అథ్లెట్ అర్షద్ నదీమ్ ఇన్‌స్టా ఖాతాను బ్లాక్ చేసిన భారత్.. గతంలో షోయబ్ అక్తర్, బాసిత్ అలీ, షాహిద్ అఫ్రీది యూట్యూబ్ చానెల్స్‌నూ బ్యాన్ చేసిన విషయం తెలిసిందే.

శ్రీశాంత్‌పై మూడేండ్ల సస్పెన్షన్

తిరువనంతపురం: భారత మాజీ పేసర్ ఎస్ శ్రీశాంత్‌పై కేరళ క్రికెట్ అసోసియేషన్ (కేసీఏ) మూడేండ్ల సస్పెన్షన్ విధించింది. ప్రస్తుతం భారత జట్టు సభ్యుడైన సంజూ శాంసన్‌కు మద్దతుగా నిలిచే క్రమంలో కేసీఏపై శ్రీశాంత్ చేసిన వ్యాఖ్యలే అతడిపై వేటుకు కారణమయ్యాయి. ఓ టెలివిజన్ చానెల్‌లో శ్రీశాంత్ మాట్లాడుతూ.. ఈ ఏడాది జరిగిన విజయ్ హజారే ట్రోఫీలో పాల్గొన్న కేరళ జట్టులో కేసీఏ.. శాంసన్‌కు చోటు కల్పించలేదని ఆరోపించాడు.



Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.